క్లుప్తంగా

క్షయ వ్యాధిపై అవగాహన

పినపాక: మనిషిని బలహీనపరిచి మరణానికి దగ్గర చేసే క్షయ వ్యాధి(టీబీ)పై సంపూర్ణ అవగాహన ఉంటేనే దాని నుంచి రక్షణ పొందవచ్చని జానంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యురాలు శృతి తెలియజేశారు. మంగళవారం మండల పరిధిలోని జానంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో జానంపేట గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శృతి మాట్లాడుతూ.. ఈ వ్యాధి బారినపడితే ఊపిరితిత్తులు చెడిపోయి ఆయాసం, దగ్గు, తరచూ జ్వరం రావటంతో పాటు బరువు తగ్గిపోయి రోగనిరోధక శక్తి క్షీణిస్తుందన్నారు. వ్యాధి ముదరక ముందే తగిన చికిత్స తీసుకుంటే దీని నుంచి ఉపశమనం పొందవచ్చునని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

నిస్వార్థ సేవకుడు జానీ

అశ్వారావుపేటరూరల్: ఎస్‌డి.మియా జానీ నిస్వార్థ సేవకుడిగా బడుగు బలహీన వర్గాలు, నిరుపేదల కోసం పని చేశారని ఏపీ సీపీఐ పార్టీ రాష్ట్ర సమితి నాయకుడు ఎండి.మునీర్ అన్నారు. మంగళవారం అశ్వారావుపేటలోని ఆ పార్టీ కార్యాలయం వద్ద మియా జానీ 17వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. ఉన్నత కుటుంబం నుంచి వచ్చిన మియా జానీ పేదలకు వందల ఎకరాలను దానం చేశారని గుర్తు చేశారు. అనంతరం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్‌డి.సలీం, ఎస్‌డి.రఫీ, పఠాన్ జలాల్ ఖాన్, వగ్గెల అర్జున్‌రావు, వాంకడోత్ శోభన్, అనీల్, ముత్తు పాల్గొన్నారు.

ఆర్థిక చేయూత

బూర్గంపాడు: ముసలిమడుగు గ్రామానికి చెందిన పిల్లి నాగరాజు, నాగశ్రీ దంపతుల 11 ఏళ్ల కుమారుడు సాయికృష్ణ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా.. మోరంపల్లిబంజర గ్రామానికి చెందిన నేస్తం వెల్ఫేర్ చారిటబల్ ట్రస్ట్ సాయికృష్ణ వైద్యఖర్చుల కోసం మంగళవారం రూ.10 వేల ఆర్థికసాయాన్ని అందించింది. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ కామిరెడ్డి రామకొండారెడ్డి, చింతా అంకిరెడ్డి, సంకా సురేష్, ఆవుల శివనాగిరెడ్డి, కై పు రమేశ్‌రెడ్డి, డి.బాలనారాయణరెడ్డి, పేరం రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో వైద్యశిబిరం

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిలోని జోతిబాపూలే కళాశాలలో ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్యపరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. డాక్టర్ ప్రియాంక్ మాట్లాడుతూ.. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌వీ ప్రకాష్‌రావు, సిబ్బంది సోనియా, కోటేశ్వరరావు, ఆశకార్యకర్తలు అనురాధ, నాగమణి, కరుణ, బేబి పాల్గొన్నారు.

వార్షిక బ్రహ్మోత్సవాలు

భద్రాచలంటౌన్: భద్రాద్రి హరిహర క్షేత్ర శ్రీఅయ్యప్ప స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా శబరిమల విధానంలో నంబూద్రి ఆధ్వర్యంలో వివిధ హోమాలు, అభిషేకాలు, పూజ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిపారు. తెల్లవారుజాము నుంచే పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమాలలో అధ్యక్షులు అడుసుమిల్లు జగదీష్ పాల్గొన్నారు.

సాంకేతిక నైపుణ్యాలను ఉపయోగించాలి

భద్రాచలంటౌన్: ప్రస్తుత ఆధునిక పోకడకు అనుగుణంగా ఉపాధ్యాయులు సాంకేతిక నైపుణ్యాలను వినియోగించుకోవాలని ఎంఈఓ టి.రమ తెలిపారు. స్థానిక కేజీబీవీ పాఠశాలలో భద్రాచలం, బూర్గంపాడు మండలాలకు చెందిన గణితం, భౌతిక శాస్త్రం, జీవశాస్త్రం, సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులకు లెర్నింగ్ మేనేజ్మెంట్ సిస్టంపై శిక్షణ కార్యక్రమంను మంగళవారం నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఉపాధ్యాయులు సాంకేతిక నైపుణ్యాలను నేర్చుకుని వాటి సహాయంతో విద్యార్థులకు ఆసక్తికరంగా విద్యాబోధన చేయాలని సూచించారు. కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ శ్రీమతి లీల, జిల్లా రిసోర్స్ పర్సన్ నాగరాజు, మండల స్థాయి సోషల్ రిసోర్స్ పర్సన్‌లు సత్యనారాయణ, సుధాకర్ రావు, భాస్కరరావు, రామకృష్ణ, రవీంద్రమ్మ, రాంప్రసాద్ పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

మణుగూరురూరల్: మున్సిపాలిటీ పరిధిలోని శివలింగాపురంలో ఉన్న నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 26వ తేదీన మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని శ్రీవిద్య విద్యాసంస్థల ఆధ్వర్యంలో ముద్రించిన వాల్‌పోస్టర్లు, కరపత్రాలను ఆలయ కమిటీ చైర్మన్ కూచిపూడిబాబు మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీవిద్య విద్యాసంస్థల డైరెక్టర్ బద్దం శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పర్సా సత్యనారాయణ, తోటకూరి గోపయ్య, ఆముదాల శ్యామల, కుంచెపు పద్మ, ఇర్పా నాగమణి, పాడుతూరి రవికుమార్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల జాబితా విడుదల

- ఓటర్లు, పార్టీల నాయకులు పరిశీలించుకోవాలని సూచన
- మార్పులు, చేర్పుల సలహాలకు ఆహ్వానం

మణుగూరురూరల్: మండల ఓటర్లకు సంబంధించిన డ్రాఫ్ట్ పోలింగ్ కేంద్రాల జాబితాను విడుదల చేసినట్లు మణుగూరు ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ జాబితాను మండల ప్రజాపరిషత్ కార్యాలయ నోటిస్ బోర్డులో ఉంచామని, ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు జాబితాను పరిశీలించుకోవచ్చని తెలిపారు. జాబితాకు సంబంధించి ఏమైనా అభ్యంతరాలు ఉన్నా, సవరణ చేయాల్సి వచ్చినా ఈ నెల 13వ తేదీ లోపు రాతపూర్వకంగా దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు.

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండలంలోని ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల డ్రాఫ్ట్‌ను ఎంపీడీఓ మహాలక్ష్మి మంగళవారం విడుదల చేశారు. పంచాయితీ కార్యాలయాల్లో, ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో డ్రాఫ్ట్ ప్రచురించారు. డ్రాఫ్ట్‌పై అభ్యంతరాలుంటే ఈ నెల 13వ, తేది సాయంత్రం 5గంటలలోపు తెలియజేయాలని ఎంపీడీఓ కోరారు.



అశ్వారావుపేటరూరల్: నోటీస్‌బోర్డులో ఓటర్ల జాబితా ఉంచుతున్న ఎంపీడీఓ

ములకలపల్లి: జెడ్పీటీసీ, ఎంపీటీసీ పోలింగ్ స్టేషన్ల జాబితా ఖరారు చేసినట్లు ఎంపీడీఓ రేవతి తెలిపారు. ఈమేరకు లిస్టను మంగళవారం నోటీస్ బోర్డులో అంటించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. పోలింగ్ స్టేషన్ల ఏర్పాట్లుపై ఏవైనా అభ్యంతరాలుంటే రేపటిలోగా (గురువారం)లోగా తెలిజేయాలని సూచించారు.

ఓటర్ల తుది జాబితా..

అశ్వారావుపేటరూరల్: జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు సంబంధించిన ఓటర్ల తుది జాబితాను స్థానిక ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో నోటీస్ బోర్డుల్లో ప్రదర్శించారు. మంగళవారం ఆయన తుది ఓటర్ల జాబితాను విడుదల చేసి, ఆ తర్వాత ఎంపీడీవో, గ్రామ పంచాయతీల కార్యాలయాల్లో అందుబాటులో ఉంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అశ్వారావుపేట మండలంలో ఒక జెడ్పీటీసీ, 11 ఎంపీటీసీ స్థానాలకు గాను మొత్తం 30,805 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు.

పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలి

ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరుటౌన్: రాష్ట్రప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలపై సోషల్ మీడియాలో జరుగుతున్న విషప్రచారాన్ని తిప్పికొట్టడమే కాక.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో యూత్ కాంగ్రెస్ బాధ్యులు కీలకంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సూచించారు. మణుగూరులో మంగళవారం యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు తరుణ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలాల్లో ప్రజలు, యువతకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారంలో కీలకంగా వ్యవహరించాలని సూచించారు. తొలుత వివిధ కారణాలతో మృతి చెందిన నాయకులు కట్టం సాయి, గోగు గురుమూర్తికి నివాళులర్పించారు. ఈ సమావేశంలో నాయకులు పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కొర్సా ఆనంద్, సామా శ్రీనివాసరెడ్డి, బాబు, పాలమూరి రాజు, కమటం నరేశ్, రాసమల్ల నాగరాజు, బొల్లినేని సురేశ్, తలకొల్ల శిరీషరెడ్డి, మల్లెం కరుణ్, పెంట్యాల వెంకటేశ్, కొప్పుల రాంగోపాల్, మనోజ్, సతీష్, సాయి,



యూత్ కాంగ్రెస్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేశ్వర్లు

హరీష్, వాసం శ్రీనాథ్ తదితరులు ఉన్నారు.

కార్మికుడి కుటుంబానికి పరామర్శ

మణుగూరు పీవీ.కాలనీకి చెందిన సింగరేణి సివిల్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగి దూలికట్ల సురేశ్ మంగళవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందగా.. మృతదేహం వద్ద ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు నివాళులర్పించి కుటుంబీకులను పరామర్శించారు. ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, కాంగ్రెస్ నాయకులు వత్సవాయి కృష్ణంరాజు, గట్టయ్య, జయరాజ్, కుమారస్వామి, గణేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెయిన్స్‌లో 'లిటిల్ ఫ్లవర్స్' ప్రతిభ



కొవ్వూరు జాహ్నవి



సనా తబస్సుం

భద్రాచలం: ఎన్‌టీఏ మంగళవారం విడుదల చేసిన జేఈఈ మెయిన్స్ మొదటి విడత పరీక్ష ఫలితాల్లో పట్టణానికి చెందిన లిటిల్ ఫ్లవర్స్ జూనియర్ కళాశాల బాలికలు ఉత్తమ పర్సంటైల్ సాధించారు. ఈ మేరకు కళాశాల నిర్వాహకులు ఈ వివరాలను వెల్లడించారు. కొవ్వూరు జాహ్నవి 90.90, మొహ్మద్ సనా తబస్సుం 87.01 పర్సంటైల్‌లను సాధించారని చెప్పారు. కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థినులను లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల డైరెక్టర్ మాగంటి ప్రసాద్ బాబు, డైరెక్టర్, ప్రిన్సిపాల్ మాగంటి రమేష్ బాబు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ కళాశాల విద్యార్థినులు దేశస్థాయిలోనే ఉత్తమ మార్కులు కైవసం చేసుకోవడం అభినందనీయమన్నారు. ఇందుకు తర్ఫీదునిచ్చిన అధ్యాపక బృందాన్ని, సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కళాశాల మ్యాథ్స్ అధ్యాపకులు బషీరు తదితరులు పాల్గొన్నారు.

సంతానోత్పత్తి పశువైద్య శిబిరం

దమ్మపేట: పశువుల కోసం నిర్వహిస్తున్న సంతానోత్పత్తి వైద్య శిబిరాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే ఆదినారాయణ కోరారు. మంగళవారం మండలంలోని గండుగులపల్లి ప్రభుత్వ పశు వైద్య కేంద్రంలో.. సంతానోత్పత్తి వైద్య శిబిరంను ఎమ్మెల్యే జారే చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ శిబిరం ద్వారా పాలు సమృద్ధిగా ఇచ్చే మేలు జాతి రకం పాడి గెదేలు, ఆవులను ఉత్పత్తి చేసుకోవచ్చని తెలిపారు. అంతకుముందుగా గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని ప్రజలు ఎమ్మెల్యేను పలు సమస్యలపై కలవగా.. సంబంధిత అధికారులతో ఫోన్‌లైన్‌లో మాట్లాడి, సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో




పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

పశువైద్యులు తేజరాణి, శ్యాంబాబు, ప్రశాంత్, కాంగ్రెస్ నాయకులు ఎంపీపీ సోయం ప్రసాద్, ఎర్రా వసంతరావు, కాకా రమేష్, మడకం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి

మణుగూరుటౌన్: ఏజెన్సీ ప్రాంతంలో ప్రజలు వైద్యం కోసం మారుమూల గ్రామాల నుంచి వస్తారని, ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకుని 100 పడకల ఆస్పత్రిలో వైద్యులు అన్ని వేళలా అందుబాటులో ఉండాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయోధ్య డిమాండ్ చేశారు. మంగళవారం 100 పడకల ఆస్పత్రిని సందర్శించిన ఆయన.. వైద్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. మౌలిక సదుపాయాల కొరత వివరాలు తెలిపితే ఎమ్మెల్యే, ఉన్నత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని అన్నారు. అనంతరం అన్ని వార్డుల్లో కలియ తిరిగి రోగులకు అందుతున్న వైద్య సౌకర్యాలను, సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. సూపరింటెండెంట్ సునీల్, సీపీఐ నాయకులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆనాటి ఉపాధ్యాయులతో విద్యార్థులు

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివిన 1997–98 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం (సిల్వర్ జూబ్లీ) మంగళవారం నిర్వహించారు. దుమ్ముగూడెం గ్రామంలో జరుగుతున్న ముత్యాలమ్మ అమ్మవారి జాతర సందర్భంగా ఆత్మీయంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా అనాటి మధురస్మృతులను గుర్తు చేసుకుని ప్రస్తుత జీవిత విశేషాలను ఒకరికొకరు పంచుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన అనాటి ఉపాధ్యాయులు రామారావు, జగపతి, బ్రహ్మం, రాంబాబు, రాజేంద్రప్రసాద్, రాజ్యలక్ష్మి, పద్మలను ఘనంగా సన్మానించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి సందడి చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాచ్ విద్యార్థులు నంబూరి సురేష్, జిలకర వీరరాఘవులు, బత్తుల షుకర్‌బాబు, నిట్టా అబ్రహం, వాగే గంగరాజు, తెల్లం ధనలక్ష్మి, నాగమణి, మద్ది శ్రీనివాస్‌రెడ్డి, రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

దమ్మపేట: మండలంలోని లింగాలపల్లి, నాయుడుపేట సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో నేడు(బుధవారం) అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఏడీఈ వెంకటరత్నం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. లింగాలపల్లి 33 కేవీ ఫీడర్లలో నూతన లైన్ ఏర్పాటు కారణంగా నేడు మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 6 గంటల వరకు సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి, విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

సారపాకలో..

బూర్గంపాడు: సారపాక విద్యుత్ సబ్ స్టేషన్‌లో బుధవారం కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తుండటంతో ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాకు కొంతమేరా అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఏఈ ఉపేందర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటనలో విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

'హామీల అమలులో విఫలం'

భద్రాచలంటౌన్: తెలంగాణ రాష్ట్రంలో ఐదు గ్యారంటీల హామీతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, వాటిని అమలు చేయడంలో పూర్తి స్థాయిలో విఫలమైందని బీఆర్‌ఎస్ డివిజన్ నాయకుడు మానె రామకృష్ణ ఆరోపించారు. స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో మంగళవారం జరిగిన బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి భద్రాద్రి గడ్డపై బీఆర్‌ఎస్ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఆకోజు సునిల్‌కుమార్, కో–కన్వీనర్ రేపాక పూర్ణచంద్రరావు, కొల్లం జయ, ప్రేమ్ కుమార్, బత్తుల నరసింహులు, ఏడుకొండలు, రామకృష్ణ, శ్రీనివాస్, నాగేశ్వరరావు, డానియల్, ప్రదీప్, బద్ది బాబి, రాఘవ, రవి కిరణ్, గోసుల శ్రీను, గణేష్, సుబ్బారావు, సమర్ కుమార్, పితాని భాను ప్రసాద్, కావూరి సీతామహాలక్ష్మి, ప్రియాంక, రమాదేవి, సలోమి తదితరులు ఉన్నారు.

విజేతలకు బహుమతి ప్రదానం

ములకలపల్లి: మండలపరిధిలోని కమలాపురం ఆశ్రమ పాఠశాల పే సెంటర్ పరిధిలోని పాఠశాలల చిన్నారులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఐటీడీఏ పీఓ రాహుల్ ప్రత్యేక చొరవతో చేపట్టిన 'ఉద్దీపకం'కార్యక్రమంలో భాగంగా పరీక్ష ఏర్పాటు చేశారు. ఈ పాఠశాల పరిధిలోని 26 స్కూళ్లకు చెందిన 78 చిన్నారులు పరీక్షకు హాజరుకాగా, విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కాంప్లెక్స్ సహాయ కార్యదర్శి సునావత్ శంకర్, ఎస్‌సీఆర్‌పీ శ్రీను, ఎల్.రాందాస్. వి.కిరణ్, బి.సరిరాం, బి.కుమార్, కె.రమేష్, సుందరం. బి.రవి. చీనా తదితరులు పాల్గొన్నారు.

తుమ్మల చెరువుకు నీరు ఇవ్వాలి

అశ్వాపురం: సీతారామ ప్రాజెక్ట్ ద్వారా నీరు ప్రథమ ప్రాముఖ్యతగా మండల పరిధిలోని తుమ్మలచెరువుకు నీరు ఎత్తిపోయాలని న్యూడెమోక్రసీ జిల్లా నాయకురాలు పెదగోని ఆదిలక్ష్మి, సీపీఎం సీనియర్ నాయకుడు స్వర్గం బాలనర్సయ్య డిమాండ్ చేశారు. మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో కేవీఆర్ ఫంక్షన్ హాల్‌లో న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి జక్కుల రాంబాబు అధ్యక్షతన మంగళవారం రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీతారామ ప్రాజెక్ట్ ద్వారా నీరు తుమ్మలచెరువుకు తరలించిన తర్వాతనే ఇతర ప్రాంతాలకు తరలించాలన్నారు. నాయకులు, ఆయకట్టు రైతులు సత్యనారాయణ, మంగి వెంకటరమణ, భీమరాజు, ఐఎఫ్‌టీయూ ఉపాధ్యక్షుడు మిడిదొడ్ల నాగేశ్వరరావు, పున్నం చందు, ప్రణయ్ పాల్గొన్నారు.

జాతర ఏర్పాట్ల పరిశీలన

కరకగూడెం: మండల పరిధిలోని చిరుమళ్ల గ్రామంలో మంగళవారం వైభవంగా ప్రారంభమైన సమ్మక్కసారలమ్మ జాతరను మణుగూరు డీఎస్పీ రవీందర్ సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. నిర్వాహకులకు, అధికారులకు పలు సలహాలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన భక్తులకు తాగు నీరు, శుభ్రమైన మరుగుదొడ్ల సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయో లేదో తనిఖీ చేశారు. వైద్య శిబిరాలలో అవసరమైన మందులు మరియు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పలు రికార్డులను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి అంకితభావంతో ప్రజలకు సేవలందించాలన్నారు.



కరకగూడెం: సూచనలిస్తున్న డీఎస్పీ రవీందర్ రెడ్డి

ఈ కార్యక్రమంలో ఏడూళ్ల బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సైలు రాజేందర్, రాజ్‌కుమార్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై చర్యలు

డీఈ జీవన్ కుమార్

పినపాక: రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు డివిజనల్ ఇంజనీర్ జీవన్ కుమార్ తెలిపారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా పినపాక మండలంలో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌లు తీసుకొస్తున్నామని దుగినేపల్లి, జానంపేట ఏరియాలో పనులు ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ వేణుగోపాల్, ఇంచార్జి ఏడీఏ ఉమారావు, ఏఈ వేణుగోపాల్, సబ్ ఇంజనీర్ వీరారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



జానంపేట పరిధిలో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న డివిజనల్ ఇంజనీర్ జీవన్ కుమార్

తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి

దుమ్ముగూడెం: మండల తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్ అశోక్‌కుమార్ ప్రజల నుంచి దరఖాస్తులను మంగళవారం స్వీకరించారు. కార్యాలయానికి వచ్చిన బాధితుల నుంచి ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా దరఖాస్తులను స్వీకరించి వాటిపై త్వరితిగతిన విచారణ జరిపి బాధితులకు న్యాయం చేసేలా చర్యలు తీసుకున్నారు.

కఠినంగా శిక్షించాలి

ములకలపల్లి: చిలుకూరు బాలాజీ ప్రధానార్చకుడిపై దాడికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని సీనియర్ జర్నలిస్ట్ ఉస్మాన్‌ఖాన్ అన్నారు. మండల పరిధిలోని జగన్నాథపురంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణా తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన చిలుకూరు బాలాజీ ఆలయ అభివృద్ధికి అహర్నిశలూ కృషి చేస్తున్న ప్రధానార్చకుడు రంగరాజన్‌పై దాడి హేయమైన చర్య అని అన్నారు. ప్రభుత్వం సత్వరమే స్పందించి దాడి కారరులకు అరెస్ట్ చేసి, తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మొక్కలు నాటుదాం



మొక్క నాటుతున్న ఎఫ్‌డీఓ కోటేశ్వరరావు

చంద్రుగొండ: కలప మొక్కలను విరివిగా పెంచుదామని కొత్తగూడెం ఎఫ్‌డీఓ కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. మండలంలోని సీతాయిగూడెం నుంచి దామరచర్ల వరకు రోడ్డుకు ఇరువైపులా చేపట్టిన అవెన్యూ ప్లాంటేషన్ పనులను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మొక్కలు నాటడంతోపాటు ఏపుగా పెంచడం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రామవరం రేంజర్ శ్రీనివాసరావు, అటవీ శాఖ సిబ్బంది, సీపీఐ మండల కార్యదర్శి బొర్రా కేశవులు పాల్గొన్నారు.

గ్యారంటీలను అమలు చేయాలి

చంద్రుగొండ: ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్‌ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీపార్టీ జిల్లా నాయకుడు ఎస్‌కె.ఉమర్ డిమాండ్ చేశారు. ఈ నెల 20న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని మద్దుకూరు, దామరచర్ల, చంద్రుగొండ గ్రామాల్లో పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రదర్శనలు చేశారు. ఈ సందర్భంగా ఉమర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు తేజావత్ భీముడు, రమేష్, మన్ను, రాకేష్, రాము, వెంకటేశ్వర్లు తదతరులు పాల్గొన్నారు.

కట్టమైసమ్మ జాతరకు సర్వం సిద్ధం

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారాయణపురం గ్రామ శివారులో ఉన్న కట్టమైసమ్మ తల్లి జాతర ఉత్సవాలు బుధవారం ఉదయం నుంచి ప్రారంభం కానున్నాయి. ఐదు రోజులపాటు జరిగే జాతర ఉత్సవాలకు సర్వం సిద్ధం చేశారు. జాతర ఉత్సవాల నేపథ్యంలో ఆలయాన్ని, ప్రధాన రహదారిను విద్యుత్ దీపాలతో అలంకరించి ముస్తాబు చేశారు. ఉత్సవాలకు అశ్వారావుపేట, దమ్మపేట మండలాలతోపాటు ఏపీలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలి వస్తారు. కాగా, జాతర ఉత్సవాలను ప్రశాంతవాతావరణంలో జరుపుకోవాలని స్థానిక ఎస్సై యయాతి రాజు సూచించారు. మంగళవారం ఆయన నారాయణపురం గ్రామంలో జాతర జరిగే ఆలయాన్ని సందర్శించి ఆలయ కమిటీ సభ్యులను పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు, గ్రామపెద్దలు ఉన్నారు.

భవనానికి స్థల కేటాయింపు

మణుగూరురూరల్: మండలంలోని ముత్యాలమ్మనగర్ గ్రామపంచాయతీ కార్యాలయ భవన నిర్మాణం కోసం మణుగూరు తహసీల్దార్ వి.రాఘవరెడ్డి స్థల పరిశీలన చేసి అనువైన ఐదు గుంటల స్థలాన్ని గుర్తించారు. భవన నిర్మాణం కోసం ఆ స్థలాన్ని కేటాయించారు. ఈ మేరకు మంగళవారం ఆయన భవనానికి కేటాయించిన భూమిని ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వరరావుకు అప్పగించారు. కార్యక్రమంలో రెవెన్యూ, మండల పరిషత్ అధికారులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

అశ్వారావుపేటరూరల్: స్థానిక ఎన్నికల నేపథ్యంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఎన్నికలపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు కార్యదర్శులు అందుబాటులో ఉండాలని, సెలవులు పెట్టొద్దన్నారు. ఎన్నికలకు సంబంధించి ఈ నెల 12వ తేదీన ఆర్‌ఓ, ఏఆర్‌ఓలకు శిక్షణ తరగతులకు సంబంధించి.. ఉత్తర్వులను వారికి అందించాలని ఆదేశించారు. వేసవి కాలం సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు రాకుండా చూడాలని, విధుల పట్ల నిర్లక్ష్యం చేయవద్దన్నారు. సమావేశంలో ఎంపీఓ సోయం ప్రసాదరావు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా థామస్ అల్వా ఎడిసన్ జయంతి

చంద్రుగొండ: శాస్త్రవేత్త థామస్ అల్వా ఎడిసన్ జయంతిని ప్రైవేటు ఎలక్ట్రీషియన్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కమిటీ అధ్యక్షుడు ఎస్‌కె.ఆసీఫ్, నాయకులు నజీర్, ఆర్ వెంకటాచారి, కమలాకర్, హబీబ్, కృష్ణ పాల్గొన్నారు.

ముగిసిన ముత్యాలమ్మ జాతర

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం గ్రామంలో పవిత్ర గోదావరి నదీ తీరాన ఉన్న ముత్యాలమ్మా అమ్మవారి 23వ జాతర మహోత్సవం మంగళవారం విజయవంతంగా ముగిసింది. ప్రతీ రెండేళ్లకోకసారి జరిగే అమ్మవారి జాతరలో భాగంగా ఈ ఏడాది తొమ్మిది రోజుల పాటు జరిగిన జాతరలో వేలాది మంది భక్తులు పాల్గొని మొక్కుబడులను చెల్లించుకున్నారు. ఆఖరి రోజు భక్తులు అందజేసిన పట్టు చీరలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జాతరలో చివరిదైనా తృతీయ ఊరేగింపులో గ్రామం మొత్తం జనసంద్రమైంది. సాయంత్రం 4 గంటలకు ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం మేళతాళాలతో, డప్పు వాయిద్యాలతో నృత్యాలు, వాయిధ్యాలు, వైషధారణలతో ఊరేగింపును చేపట్టారు. గ్రామంలోని యువకులు ఆడవేశధారణతో అమ్మవారి గరిగెలను తలపై పెట్టుకుని పురవీధుల్లో ఊరేగింపు చేశారు. జాతరలో రాత్రి సమయంలో నిర్వహించిన బాణాసంచా కాల్పులు ప్రజలను



గరిగెలతో నిర్వహిస్తున్న తృతీయ ఊరేగింపు

ఆహ్లాదపరిచాయి. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ చైర్మన్ చుక్కా గణేష్‌రెడ్డి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు పత్యేక ఏర్పాట్లను చేశారు. జాతర ఆఖరి రోజు ఊరేగింపు అమ్మవారి దర్శనం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా సీఐ అశోక్ పర్యవేక్షణలో ఎస్‌ఐలు గణేష్, వెంకటప్పయ్యల ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాట్లను చేశారు.